సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ׀ 29 ׀ సెప్టెంబర్ ׀ 2025



జగన్మాతను వీక్షించి.. తరించి

జిల్లాలో వివిధ ఆలయాల్లో కొలువైన జగన్మాత శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు రూపాల్లో భక్తులకు దర్శనమించి, కటాక్షించారు.

-8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,17,450
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,585
3 శాతం జీఎస్టీతో	రూ.10,902
నవర (8 గ్రా)	రూ.87,216

గరిష్టం/కనిష్టం
35.8 /26.8

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉండి చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆదివారం గాలిలో తేమ 47 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి

- 2.65 లక్షల కుటుంబాలకు న్యాయం చేయాలి
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి



ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్ల సంఘ ప్రతినిధులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)/నెల్లూరు(వీఆర్సీ సెంటర్): ప్రభుత్వ సంక్షేమ పథకాలను, సేవలను ప్రజల ఇంటి ముందుకు ఎలాంటి పక్షపాతం, అవినీతి, జాప్యం లేకుండా అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెచ్చిన వలంటీర్ల వ్యవస్థను కూటమి ప్రభుత్వం కొనసాగించాలని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని ఎన్నికల్లో చెప్పి, అధికారంలోకి వచ్చాక మాట తప్పిందని, 2.65 లక్షల వలంటీర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారికి న్యాయం చేయాలన్నారు. కూటమి చేసిన అన్యాయంపై వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని, చట్టసభల్లో నిలదీస్తామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు వలంటీర్ల సంఘం ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి నెల్లూరు నగర వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రామ/ వార్డు వలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమాయున్ బాషా, గౌరవ సలహాదారు ఈదర గోపీచంద్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు నాగూర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంద్యాల హరి, పొదలకూరు శ్రీనివాసులు, ఇంగ్లిష్ మీడియం విద్యా పరిరక్షణ వేదిక రాష్ట్ర సమన్వయకర్త దాదినబోయిన ఏడుకొండలు, పలువురు మహిళా వలంటీర్లు పాల్గొన్నారు. అంతకుముందు వెంకటేశ్వరపురంలో జరిగిన వలంటీర్ల సమావేశంలో ఉద్యమాన్ని కొనసాగించాలని తీర్మానించారు.

నేటి నుంచి బీఈడీ రెండో విడత కౌన్సెలింగ్


నెల్లూరు (టౌన్): బీఈడీలో కన్వీనర్ కోటాలో ప్రవేశం కోసం ఈ నెల 29 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ సి.లక్ష్మీప్రసన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 4వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 7వ తేదీ వరకు వెబ్ ఆప్షన్, 8న వెబ్ ఆప్షన్ మార్పు, 10వ తేదీ తుదిగా సీట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. నెల్లూరు ప్రభుత్వ బీఈడీ కళాశాలలో సీటు ఖరారు అయిన విద్యార్థులు 13న సెల్ఫ్ జాయినింగ్ రిపోర్ట్ ద్వారా ప్రవేశం పొందవచ్చన్నారు. తొలి విడత కౌన్సెలింగ్‌లో 64 మంది ప్రవేశం పొందారని, రెండో విడత కౌన్సెలింగ్‌లో మరో 36 మందికి అవకాశం ఉందన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



నెల్లూరురూరల్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ meekosam.ap. gov.in ద్వారా నమోదు చేసుకోవచ్చునని, అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చునన్నారు. సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైందన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికమైంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ గోగర్భం డ్యాం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 75,006 మంది స్వామి వారిని దర్శించుకోగా 45,413 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.36 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ప్రాణాలు పోతున్నాయ్..

ఇసుక, గ్రావెల్ మాఫియాల దాష్టీకాలకు అమాయకుల బలి

- ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్ ఢీకొని ఏడుగురి దుర్మరణం
- గ్రావెల్ గుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృత్యువాత
- నూరాయపాళెం వద్ద ఇద్దరు బలి
- సర్వేపల్లిలో గతంలోనూ గ్రావెల్ గోతుల్లో పడి 9 మంది పిల్లలు మృతి
- పెన్నా ఇసుక, గ్రావెల్ గుంతల్లో ప్రాణాలు కోల్పోయిన పలువురు



సంగం మండలం పెరమన వద్ద ఇసుక టిప్పర్ ఢీకొన్న దుర్ఘటనలో కారులోనే మృతదేహాలు (ఫైల్)

టీడీపీ నేతల ధన దాహం.. అమాయక పిల్లలు, ప్రజల ప్రాణాలకు సంకటంగా మారింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని సాగిస్తున్న అక్రమాలకు ప్రజల ప్రాణాలు పోతున్నా.. కనీసం వీరిలో ఏ మాత్రం మానవత్వం కనిపించడం లేదు. ఆయా కుటుంబాలను ఆదుకునేందుకు కూడా ముందుకు రాని పరిస్థితి చూస్తుంటే కసాయితత్వం కనిపిస్తోంది. జిల్లాలో ఇసుక, గ్రావెల్ మాఫియాల దారుణాలకు అనేక కుటుంబాలకు ఎన్నటికీ తీర్చలేని కడుపు కోత, కన్నీటి వేదన మిగిలిపోతున్నాయి. ఇసుక, గ్రావెల్ తవ్వకాలకు ఎక్కడా అనుమతి లేకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా తవ్వి, భారీ వాహనాల్లో తరలిస్తూ ప్రజలను బలి తీసుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన ఘటనలు టీడీపీ నేతల స్వార్థపూరిత అరాచక పాలనకు చీకటి సాక్ష్యాలు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో టీడీపీ నేతల అరాచకాలు, అమానవీయ ఘటనలకు లెక్కే లేకుండా పోతోంది. ధనదాహంతో నరమేధ చరిత్ర సృష్టిస్తున్నారు. వీరు చేసే తప్పు వల్ల అమాయక ప్రజల ప్రాణాలు పోతున్నా.. ఏమీ పట్టనట్లుగా అక్రమ సంపాదనే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి రూ.కోట్లు గడిస్తున్నారు. ఇసుక, గ్రావెల్ తవ్వకాల అక్రమాలు ప్రజల ప్రాణాలను బలిగొంటున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని జరుగుతున్న ఈ దోపిడీ దాష్టీకాలు అమాయక కుటుంబాలపై ఎన్నటికీ నయం కాని గాయాలు మిగులుస్తున్నారు. ఇటీవల ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ ఢీకొని ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం, గ్రావెల్ గుంతల్లో పడి ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడటం, నూరాయపాళెం వద్ద జరిగిన దుర్ఘటన, సర్వేపల్లిలో గతంలోనే తొమ్మిది మంది చిన్నారుల మరణాలు ఒకే వాస్తవాన్ని చాటుతున్నాయి.

13 మంది ప్రాణాలు తీసిన ఇసుక తవ్వకాలు

జిల్లా పరిధిలో పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు ఎక్కడా అధికారిక అనుమతి లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 15 నెలలుగా టీడీపీ నేతలు ఊరూరా అడుగడుగునా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతూనే ఉన్నారు. రూ.వందల కోట్లు విలువైన ఇసుకను జిల్లా సరిహద్దులు దాటించారు. టీడీపీ నేతల ఇసుక తవ్వకాలకు ఇప్పటి వరకు దాదాపు 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్ల మండలం పెరుమాళ్లపాడు వద్ద ఇసుక తవ్వకాలకు రీచ్‌కు ఎలాంటి అనుమతే లేదు. కానీ అక్కడ రీచ్‌లోకి ఏకంగా పక్కాగా గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అక్కడి నుంచి ఇసుక తవ్వి తీసుకు వస్తున్న టిప్పర్ డ్రైవర్ తప్పతాగిన మైకంలో రాంగ్ రూట్‌లో ఎదురుగా కారును ఢీకొనడంతో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. టీడీపీ నేతల పాపానికి ఈ దుర్ఘటనలో ఐదు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రెండు కుటుంబాల్లో చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయారు. మరో కుటుంబంలో ఇప్పటికే తండ్రిపోయిన బిడ్డలు.. ఇప్పుడు తల్లిని పోగొట్టుకున్నారు. మరో రెండు కుటుంబాల్లో ఇంటికి మగ దిక్కు లేకుండా చేసింది. ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకుని ఉంటే.. ఆ కుటుంబాలు ఇలా రోడ్డునే పరిస్థితి వచ్చేది కాదు. ఈ దుర్ఘటన జరిగాక అధికారంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు మీడియాల్లో సానుభూతి ప్రకటనలిచ్చి చేతులు దులుపుకున్నారే కానీ.. వారిని ఆదుకోవాలనే ఆలోచన ఎంత మాత్రం చేయకపోవడం దారుణం. కనీసం ఆ కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటామనే భరోసా కల్పించలేకపోయిన రాతి గుండెలని మరోసారి రుజువు చేసుకున్నారు.



బురాన్‌పూర్ చెరువులో గ్రావెల్ అక్రమ తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

చిన్నారులను మింగేస్తున్న గ్రావెల్ గుంతలు

గ్రావెల్ మాఫియా ధనదాహం కలువాయి మండలం ఉయ్యాలపల్లికి చెందిన ఇద్దరు చిన్నారుల ప్రాణాలను బలిగొంది. సరదాగా ఆడుతూ.. పాడుతూ వెళ్లిన ఇద్దరు చిన్నారులు మృత్యు ఒడిలోకి చేరుకున్నారు. గ్రామానికి చెందిన నూతేటి ప్రసాద్ లక్ష్మీదేవి దంపతుల కుమారుడు నూతేటి విష్ణుకుమార్ (11), మనబోటి నరసింహులు, సునీత దంపతుల కుమారుడు మనోబోటి నవశ్రావణ్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఎక్కడికైనా ఇద్దరే వెళ్లి సరదాగా ఆడుకుంటూ కలిసి మెలిసి తిరిగేవారు. గ్రామానికి సమీపంలో డ్రాగన్ ఫ్రూట్ తోట ఉండడంతో ఇద్దరు స్నేహితులు కలిసి డ్రాగన్ ఫ్రూట్స్, కలేకాయల కోసం ఇంటి నుంచి వెళ్లారు. చీకటిపడినా ఇంటికి రాకపోవడంతో ఇరు కుటుంబ సభ్యులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఉయ్యాలపల్లి గ్రామ సమీపంలోని చెరువు వద్ద గ్రావెల్ మాఫియా తవ్విన గుంతల్లో మృతదేహాలు బయటపడ్డాయి. ఆ ప్రాంతమంతా బురదమయంగా ఉండడంతో యంత్రాల సహాయంతో నీటిని మళ్లించారు. మృతదేహాలను అతికష్టం మీద బయటకు తీశారు.

- వెంకటాచలం మండలంలో ఊరూరా నాణ్యమైన గ్రావెల్ ఉండడంతో రాత్రి, పగలు తేడాలేకుండా చెరువుల్లోనూ తవ్వకాలు చేస్తుండటంతో పలు గ్రామాల్లో చెరువులు బావులను తలపిస్తున్నాయి. ఈ బావుల్లో అయాయక ప్రజలు పడి మృత్యువాతకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. 2014–19 మధ్య కాలంలో టీడీపీ నేతలు సాగించిన గ్రావెల్ అక్రమ తవ్వకాలకు ఒక్క సర్వేపల్లి రిజర్వాయర్ పరిసరాల్లోనే 9 మంది పిల్లలు మృతి చెందడంతో వారి తల్లిదండ్రులకు తీరని కడుపు కోత మిగిలింది.




కలువాయి మండలం ఉయ్యాలపల్లిలో గ్రావెల్ మాఫియా తీసిన గోతిలో పడి మృతి చెందిన ఇద్దరు చిన్నారులు (ఫైల్)

- పొదలకూరు మండలం సూరాయపాళెం ఇసుక రీచ్ వద్ద డ్రెడ్జింగ్ పనులు చేస్తుండగా పైపు పగిలి ఒక యువకుడు గల్లంతై మృతి చెందగా, మరో యువకుడు తీవ్రగాయాలతో బయటపడ్డాడు. అంతకు ముందు ఇదే ప్రాంతంలో చేపలు పట్టేందుకు వచ్చిన ఓ గిరిజన యువకుడు ఇసుక గోతుల్లో కూరుకుపోయి మృత్యువాత పడ్డాడు.
- కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం నుంచి జమ్మిపాళెం వరకు వివిధ ఘటనల్లో ఐదుగురు మృత్యువాత పడ్డారు. చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు, పశువులు మేపేందుకు వెళ్లి మరొకరు, సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లి ఇంకో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

ఈ పాపాలు ఎవరివి?

అధికార మదం, ధనదాహంతో అనుమతులు తీసుకోకుండా మైనింగ్ శాఖ ప్రామాణికాలు పాటించకుండా టీడీపీ నేతలు ఇష్టారీతిన చేపడుతున్న ఇసుక, గ్రావెల్ తవ్వకాలకు అమాయక పిల్లలు, ప్రజలు ప్రాణాలు పోతున్నాయి. అడ్డుకోవాల్సిన అధికారులు టీడీపీ నేతల దగ్గర మామూళ్లు దండుకుంటూ రూ.కోట్లు గడిస్తున్నారు. ప్రాణాలు పోయిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ పాపాలు అధికారులవా? టీడీపీ నేతలవా?. ఇప్పటికైనా కలెక్టర్, ఎస్పీతోపాటు జిల్లా మైనింగ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఇళ్ల నిర్మాణంపై
అబద్ధాల చంద్రబాబు అసత్యాలు

- 15 ఏళ్లలో పేదల గృహాలను పట్టించుకోలేదు
- కూటమి ప్రభుత్వంలో 3 లక్షల ఇళ్లకు రూ.2,200 కోట్లు ఖర్చు చేశామనడం నిస్సిగ్గు
- వేదిక ఏదైనా సరే కల్లార్పకుండా అబద్ధాలు చెప్పడంలో దిట్ట
- గత ప్రభుత్వంలో చేసిన పనులు తన ఖాతాలో వేసుకుంటూ అసత్యాలు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి, చిత్రంలో ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 15 ఏళ్లలో పేదల ఇళ్ల నిర్మాణం గురించి ఏమాత్రం ఆలోచన చేశాడో ప్రజలందరికీ తెలుసునని, తాజాగా అసెంబ్లీ వేదికగా ఇళ్ల నిర్మాణంపై పచ్చి అబద్ధాలు వల్లెవేశాడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం కాకాణి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం 6.15 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామని చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 3 లక్షల ఇళ్లు నిర్మించిందని, అందుకోసం రూ.2200 కోట్లు ఖర్చు చేశామని, దీపావళి కానుకగా మరో 3 లక్షల ఇళ్లు పూర్తి చేస్తామని నిస్సిగ్గుగా మరో అబద్ధం చెప్పారని ధ్వజమెత్తారు. బీసీ, ఎస్సీలకు రూ.50 వేల, ఎస్టీలకు రూ.70వేల, ఆదివాసీలకు రూ.లక్ష వరకు పెంచి ఇస్తున్నామని మరో అబద్ధాన్ని కళ్లార్పకుండా చెప్పాడన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండు లేదా మూడు సెంట్లు ఇంటి స్థలం ఇస్తున్నామని, ప్రజలు ఛీదరించుకుంటారన్న సోయ లేకుండా 2029 నాటికి ఇళ్లు లేని వారు ఎవరూ ఉండరని అబద్ధాలు చెప్పడానికి సిగ్గు లేదా అని ప్రశ్నించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో 9.02 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి

వైఎస్సార్‌సీపీ హయాంలో దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఐదేళ్లలో 31.19 లక్షల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. దాదాపు 22 లక్షల కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసి, నిర్మాణాలు ప్రారంభించామని, తమ ప్రభుత్వం దిగిపోయే నాటికి 9.02 లక్షల ఇళ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఒక్కో ఏరియాలో వందల ఎకరాల్లో 10 వేలకు పైగా లేఅవుట్లు వేసి ఊర్లను తలపించేలా కొత్తగా ఇల్లు నిర్మించామన్నారు. మొత్తం 71,811 ఎకరాలు సేకరించామని, ఎకరం ఐదారు కోట్ల విలువ చేసే భూములను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కొని పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చిందన్నారు. ఒక్కో ప్లాటు విలువ రూ. 3.50 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు ధర పలుకుతోందని, రూ.76 వేల కోట్ల విలువైన ప్లాట్లను పేదలకు ఇవ్వడం జరిగిందన్నారు. 17,005 వైఎస్సార్ జగనన్న కాలనీలు ఏర్పాటయ్యాయని, చాలా ఇళ్లు అనేక దశల్లో ఉన్నాయన్నారు. దాదాపు 2 లక్షల టిడ్కో ఇళ్లను ఒక్క రూపాయికే పేదలకు వైఎస్ జగన్ అందించారని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక వాటికి నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు అనే పేరును తీసేసి పీఎంఏవై ఎన్టీఆర్ నగర్‌లుగా మార్చడం తప్ప చేసిందేమీ లేదన్నారు. 2024 ఎన్నికల నాటికి మరో 2 లక్షల ఇళ్లు పూర్తయ్యే దశలో ఉంటే వాటిని కూడా చంద్రబాబు తన ఖాతాలో వేసుకుంటున్నాడన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా అడ్డుకున్నది బాబే

వైఎస్ జగన్ పేదలకు ఇళ్లు కట్టిస్తుంటే దాదాపు వెయ్యి కేసులేసి అడ్డుకోవాలని చూశాడని, ఆఖరుకు అమరావతి రాజధానిలో పేద ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీలకు వైఎస్ జగన్ ఇళ్ల పట్టాలిస్తే దాన్ని కూడా కేసులేసి చంద్రబాబు అడ్డుకున్నాడన్నారు. చివరకు సుప్రీం కోర్టుకు వెళ్లి మరీ 50,793 ఇళ్లకు ఒకే చోట పట్టాలు పంచిన చరిత్ర జగన్‌కే దక్కుతుందన్నారు. సెంటు స్థలం సమాధి కట్టుకోవడానికి కూడా పనికిరాదని ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని పేదల ఇళ్లపై విషప్రచారం చేశాడని, ఇంటి స్థలంపై పేద వాడికి సర్వ హక్కులు కలిగేలా ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా కన్వేయన్స్ డీడ్ పేదల పేరుతో ఇస్తే దాన్ని కూడా చంద్రబాబు ఓర్చుకోలేకపోయాడన్నారు. కరోనా, కోర్టు కేసులు అధిగమించి రికార్డు స్థాయిలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం రూ. 1.80 లక్షలు ఇచ్చిందని, డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారిని ఆదుకోవడానికి రూ.35 వేలు పావలా వడ్డీకే ఇచ్చారన్నారు. రూ.15 వేలు విలువ చేసే ఉచిత ఇసుకతో పాటు స్టీల్, సిమెంట్ వంటి 12 రకాల సామగ్రి కొనుగోళ్లలో రూ.40 వేల మేర లబ్ధి చేకూర్చారన్నారు. ఆ విధంగా ఒక్కో ఇంటి నిర్మాణం కోసం రూ. 2.70 లక్షల మేర ఖర్చు చేశామని, వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి నిర్మాణం కోసం చేసిన ఖర్చు అక్షరాలా రూ.32,909 కోట్లు అని తెలిపారు.

అసెంబ్లీ సమావేశాల్లో కాలక్షేపం

అసెంబ్లీ సమావేశాలు కూటమి సభ్యుల కాలక్షేపానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ని నిందించడానికి, చంద్రబాబు, లోకేశ్ గొప్పలు చెప్పి పొగిడించుకోవడానికే వాడుకున్నారు తప్ప ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చలు జరిగినట్టే కనిపించలేదన్నారు. సభ్యుల నోటి వెంట నోరు తెరిస్తే అబద్ధాలు తప్ప మరొకటి వినిపించలేదని, ఎమ్మెల్యే బాలకృష్ణ మాటలకు చిరంజీవి ఇచ్చిన కౌంటరే ఉదాహరణ అన్నారు.

టిడ్కో ఇళ్ల పేరుతో చంద్రబాబు రూ.2,203 కోట్ల అవినీతి

ఇళ్ల నిర్మాణం పేరుతో పేదవాడి మీద భారం మోపిన ఘనుడు చంద్రబాబు అని, 2016–17లో 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 415 చదరపు అడుగుల్లో మూడు రకాల ఇళ్లను మూడు అంతస్తుల్లో నిర్మిస్తానని హామీ ఇచ్చాడన్నారు. 300 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగే ప్లాటుకు రూ. 2.60 లక్షల ధర నిర్ణయించి వారికి బ్యాంకు రుణం ఇప్పించి వారు నెల నెలా రూ.3 వేల చొప్పున 20 ఏళ్ల పాటు దాదాపు రూ. 7.20 లక్షలు చెల్లించేలా ప్రణాళిక రూపొందించాడన్నారు. ఆ విధంగా పేదవాడి మీద బాంబు వేశాడన్నారు. నిర్మాణ కంపెనీల నుంచి ముడుపులు తీసుకున్నాడని, ముడుపులు ఎక్కువగా ఇచ్చిన వారికి ఎక్కువ ధరకు, తక్కువగా ఇచ్చిన కంపెనీకి తక్కువ ధరకు కాంట్రాక్టులు కట్టబెట్టాడని, 2016–17 మధ్య కాలంలో ఇంటి నిర్మాణం చదరపు అడుగుకి రూ.900 నుంచి రూ. వెయ్యి వరకు ఉంటే చంద్రబాబు మాత్రం రూ. 2,534.75 నుంచి రూ.2,034.50లకు ఇచ్చాడన్నారు. ఆ విధంగా రూ.2,203 కోట్లు దోచుకుతిన్నాడని, పేదవాడి ఇంటి నిర్మాణంలో కూడా చంద్రబాబు భారీగా అవినీతికి పాల్పడ్డాడన్నారు. ఆ రోజు మార్కెట్ ధరతో పోల్చితే పేదల నుంచి రూ.1200 అదనంగా వసూలు చేశాడన్నారు.



డిజిటల్ క్యూఆర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాకాణి, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు

పక్షపాత అధికారుల భరతం పడుతాం

- కార్యకర్తలకు అండగా నిలిచేందుకు డిజిటల్ బుక్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అధికార మదంతో విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్న టీడీపీ నేతలు, వీరి అండ చూసుకుని పక్షపాతంతో వ్యవహరిస్తున్న అధికారుల భరతం పట్టేందుకే డిజిటల్ బుక్‌ను ప్రారంభించినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అన్యాయానికి గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యూఆర్ కోడ్‌తో కలిగిన డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారని తెలిపారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీ, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పార్టీ ముఖ్య నేతలతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాకాణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని ఇబ్బంది పెట్టిన, పెట్టే వారిపై ఫిర్యాదు చేసేందుకు డిజిటల్ బుక్ ఒక అస్త్రమన్నారు. తమను ఇబ్బంది పెట్టిన వారిపై కార్యకర్తలు, ఈ బుక్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చునన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తలు ఫిర్యాదు చేసిన వారిపై తప్పకుండా శిక్ష పడేలా చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున, నాయకులు బొబ్బల శ్రీనివాసులు యాదవ్, పేన్నేటి కోటేశ్వరరెడ్డి, మందల వెంకటశేషయ్య తదితరులు ఉన్నారు.

సోమశిలకు 24,833 క్యూసెక్కుల వరద



సిద్ధవటం వద్ద పెన్నానదిలో వరద ప్రవాహం

సోమశిల: జలాశయానికి వరద జలాలు పెరిగినట్లు ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. పైతట్టు ప్రాంతంలోని ఆదినిమ్మాయపల్లి రెగ్యులేటర్ నుంచి 24,833 క్యూసెక్కుల వరద జలాలు జలాశయానికి చేరుతున్నాయన్నారు. ఈ వరద జలాలను జలాశయంలో నిల్వ ఉంచకుండా దిగువకు విడుదల చేస్తామన్నారు. పెన్నానదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం జలాశయం నుంచి పెన్నానదికి 2,650, కండలేరుకు 6000, ఉత్తర కాలువకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. జలాశయంలో 72.87 టీఎంసీలు ఉన్నాయి.

కనులారా వీక్షించి.. తరించి..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఆదివారం లోకమాత వివిధ రూపాల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయాలకు మహిళా భక్తులు పోటెత్తారు.
- సాక్షి నెట్‌వర్క్


నెల్లూరులో కాళికా అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు


మూలాపేటలో చండీ అలంకారం


కన్యకాపరమేశ్వరి ఆలయంలో ధనలక్ష్మి అలంకరణ


దుర్గాలంకారంలో ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు


జొన్నవాడలో మహాలక్ష్మిగా కామాక్షితాయి


పెంచలకోనలో విజయలక్ష్మీదేవి అలంకరణలో ఆదిలక్ష్మీదేవి



పెద్దాస్పత్రికెళ్తే రోగాలు ఫ్రీ


ఓపీ చీటీల కోసం క్యూలో ఉన్న రోగులు


ఓపీ రాసే గది పక్కనే స్త్రీలు, పురుషులు ఉపయోగించే మరుగుదొడ్డి

- పారిశుద్ధ్యానికి నెలకు రూ.లక్షల్లో ఖర్చు
- ఓపీ చీటీలు రాసే చోట స్త్రీ, పురుషులకు ఒకటే టాయ్‌లెట్
- వార్డుల్లోని మరుగుదొడ్లు కంపు కంపు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్పొరేట్ ఆస్పత్రి తరహాలో క్లీనింగ్
- కూటమి పాలనలో నిర్లక్ష్యం

నెల్లూరులోని కొండాయపాళేనికి చెందిన బత్తల నారాయణమ్మకి బీపీ పెరిగిపోయింది. కాలు, చేయి చచ్చుబడ్డాయి (పెరాలసిస్). పేదరాలైన ఆమె కుటుంబ సభ్యులతో కలిసి పెద్దాస్పత్రి (సర్వజన ఆస్పత్రి)కి వైద్యం కోసం ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం వచ్చి జనరల్ మెడిసిన్ విభాగం కింద ఫిమేల్ మెడికల్ వార్డులో అడ్మిట్ అయ్యారు. వైద్యం బాగా చేస్తారని సంబంధిత డాక్టర్‌కు రాజకీయ నాయకులతో ఫోన్ చేయించుకున్నారు. పక్కరోజు డిశ్చార్జి చేయాలని రోగి డాక్టర్‌ను అడిగారు. వారు వైద్యం సక్రమంగా అందలేదా అని ప్రశ్నిస్తే అలాంటిదేమి కాదు.. ముందే నేను నడవలేను. టాయ్‌లెట్‌కు పోవాలంటే నరకం కనిపిస్తోంది. శుభ్రత లేదు. లైట్లు వెలగవు. కంపు భరించలేకున్నా.. కొత్త జబ్బులు వచ్చేలా ఉన్నాయి. ప్రైవేట్ వైద్యశాలకు వెళ్తా అని డిశ్చార్జి అయ్యింది.

నెల్లూరు (అర్బన్): జిల్లాకు రెఫరల్ ఆస్పత్రి అయిన జీజీహెచ్‌లో దారుణ పరిస్థితులున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్యసేవల్లో నిర్లక్ష్యం పెరిగింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్పొరేట్ వైద్య స్థాయిలో సేవలందించిన జీజీహెచ్‌లో గైనకాలజీ, మెడిసిన్, ఐసీయూ, ఎమర్జెన్సీ, కంటి విభాగం, పల్మనాలజీ, చిన్నపిల్లల విభాగం ఇలా వివిధ వార్డుల్లో రోగులు సుమారు 500 మందికి పైగానే రోజూ ఇన్‌పేషెంట్లుగా ఉంటున్నారు. ఏ వార్డులో చూసినా మరుగుదొడ్లు దుర్గంధంతో నిండిపోయి ఉన్నాయి.

శానిటేషన్ పట్టని అధికారులు

ఆస్పత్రిలో 150 పారిశుద్ధ్య కార్మికులున్నారు. వీరిలో 20 మంది ఎఫ్ఎన్‌ఓలు ఉన్నారు. మిగిలిన వారు సక్రమంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం లేదని ఆరోపణలున్నాయి. దీంతో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని రోగులు ఆరోపిస్తున్నారు. దుర్గంధం భరించలేకనే అనేకమంది అడ్మిట్ అయ్యేందుకు ఇష్టపడడం లేదు. సుమారు 40 శాతం మంది అడ్మిట్ కాకపోవడానికి బాత్‌రూంల కంపు కారణమని రోగులతోపాటు సిబ్బంది పేర్కొంటున్నారు. పేరుకే ముగ్గురు అడ్మినిస్ట్రేషన్ అధికారులు, ఎనిమిది మంది రెగ్యులర్ సూపర్‌వైజర్లు, 15 మంది అవుట్ సోర్సింగ్ సూపర్ వైజర్లున్నారు. వీరెవరూ రౌండ్స్ వేయకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది.

ఒకటే దారి

వైద్యం కోసం 1,200 నుంచి 1400 మంది క్యూలో నిలబడి రోజూ ఓపీ చీటీలు తీసుకుంటున్నారు. అయితే ఓపీ తీసుకునే పక్కనే మరుగుదొడ్డి ఉంది. అందులో రెండు గదులుండగా ఒకదానిని బ్లాక్ చేశారు. లోపలికి వెళ్లాలన్నా స్త్రీ, పురుషులకు ఒకే దారి. బయట పెన్సిల్‌తో జెంట్స్ టాయిలెట్ అని రాసి ఉంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కంపు భరించలేం



ఆస్పత్రిలో టాయిలెట్స్ కంపు కొడుతున్నాయి. ఇటీవల నా భార్యను వైద్యం కోసం అడ్మిట్ చేశాను. మరుగుదొడ్డికి వెళ్లే పరిస్థితి లేదని ఆమె బాధపడింది. దీంతో త్వరగా డిశ్చార్జి చేయించాను.

– గంగాధర్, సుందరయ్య కాలనీ, నెల్లూరు

పరిస్థితిని చక్కదిద్దుతున్నాం

టాయ్‌లెట్స్ శుభ్రతపై సూపరింటెండెంట్‌తో చర్చించాం. కొంత ఆర్థిక ఇబ్బందులున్నాయి. పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపడుతున్నాం. కొత్త టాప్‌లు ఏర్పాటు చేయబోతున్నాం.

– డాక్టర్ శ్రావణ్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి, సర్వజన ఆస్పత్రి

బంగారు గొలుసు చోరీ

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును తెంపుకెళ్లిన ఘటన నెల్లూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సీతారామపురం మండలం అయ్యవారిపల్లికి చెందిన జయమ్మ శనివారం నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్‌కు వచ్చింది. సెలవులు కావడంతో బస్టాండంతా రద్దీగా ఉంది. ఆమె బస్సు ఎక్కే క్రమంలో మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు తెంపుకెళ్లాడు. బాధితురాలు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆదివారం కేసు నమోదు చేశారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన నెల్లూరులోని సారాయంగడి సెంటర్ వద్ద ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బారాషహీద్ దర్గా వద్దకు వెళ్లేందుకు సుమారు 70 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వృద్ధుడు పద్మావతి సెంటర్ వద్ద ఆటో ఎక్కాడు. సారాయంగడి సెంటర్ వద్దకు వచ్చేసరికి మితిమీరిన వేగంతో కారు వెనుక నుంచి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. వృద్ధుడి తలకు తీవ్ర గాయం కాగా, ఆటో డ్రైవర్ పెంచలయ్య, మరో ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో వృద్ధుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మృతుడిని బారాషహీద్ దర్గా వద్ద ఉండే మొహిద్దీన్‌గా పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

జోయాలుక్కాస్‌లో బ్రోచర్ల ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): నెల్లూరు మినీబైపాస్ రోడ్డు గోమతి నగర్‌లో ఉన్న జోయాలుక్కాస్ న్యూ సెకండ్ బ్రాంచ్ షోరూమ్‌లో జ్యువెలరీ సేల్ ఆఫర్లను బాబు ఐస్‌క్రీమ్ అధినేత పొన్నేరి హరికృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజర్ అక్రమ్ మొహమ్మద్, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్ మాట్లాడారు. అన్ని జ్యువెలరీలు, గోల్డ్, డైమండ్స్, అన్‌కట్ డైమండ్స్, ప్రెషస్, ప్లాటినమ్, సిల్వర్ జ్యువెలరీలో మజూరీపై 50శాతం తగ్గింపు అందిస్తున్నామన్నారు. అలాగే జీవితపర్యంతం ఉచిత నిర్వహణ, ఏడాది ఉచిత బీమా, బైబ్యాక్ హామీ ఉందన్నారు. కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిమ్మ ధరలు (కిలో)




పెద్దవి : రూ.35
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.120
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.218
స్కిన్‌లెస్ చికెన్:	రూ.240
లేయర్ చికెన్:	రూ.187

కండలేరులో 56.730 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 56.090 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,400 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరు కాలువకు 90, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

గుండెను కాపాడుకుందాం

జిల్లాలో పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు

- నేడు వరల్డ్ హార్ట్ డే
- ఈ సంవత్సరం థీమ్ 'డోన్ట్ మిస్ ఏ బీట్'



నెల్లూరను(అర్బన్): గుండెపోటు.. ఒకప్పుడు 60 సంవత్సరాల వయసు దాటిన వారికి కనిపించేది. అయితే నేటి యాంత్రిక యుగంలో యువత హార్ట్ స్ట్రోక్‌కు గురవుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సెప్టెంబర్ 29వ తేదీని ప్రపంచ గుండె దినోత్సవంగా ప్రకటించింది. ఈ సంవత్సరం థీమ్ డోంట్ మిస్ ఏ బీట్. సోమవారం జిల్లాలో డాక్టర్లు, వైద్యశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

పెరుగుతూ..

ఒత్తిడితో కూడుకున్న పని, మారిన జీవనశైలి, తగిన వ్యాయామం లేకపోవడంతో గుండెపోటు వస్తుంది. జంక్ ఫుడ్ తినడం, నిద్ర లేకపోవడం, బీపీ, షుగర్ కూడా కారణాలుగా ఉన్నాయి. శీతాకాలంలోనే కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని అధ్యయనాల్లో తేలింది. కోవిడ్ తర్వాత రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అనేకమంది దీని బారిన పడుతున్నారు. ఇటీవల కాలంలో 8వ తరగతి చదువుతున్న ఓ బాలుడు తరగతి గదిలోనే కుప్పకూలాడు. వెంటనే ఆస్పత్రికి తరలించే సరికే మృత్యువాత పడ్డాడు. మరో చోట 20 ఏళ్ల యువతికి గుండెపోటు వచ్చింది. జిల్లాలో 15 శాతం మంది అనగా సుమారు 3.5 లక్షల మంది ప్రజలు ఏదో ఒక రకమైన గుండె జబ్బులతో బాధపడుతున్నారు. రోజూ వెయ్యి మందికి పైగా హార్ట్ సమస్యలతో డాక్టర్ల వద్దకు వెళ్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

గుండె సమస్యలు రాకుండా ఉండాలంటే తగిన అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలి. తాజా పండ్లు, కూరగాయలు, విత్తనాలు, పప్పుధాన్యాలు, చిక్కుళ్లు తినాలి. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలి. బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. అధిక కొలెస్ట్రాల్ తగ్గించుకోవాలి. జాగ్రత్తలు పాటిస్తే 85 శాతం మరణాలను ఆపొచ్చు. 30 సంవత్సరాల వయసు దాటిన వారు సంవత్సరానికి ఒకసారి వైద్యపరీక్షలు చేయించుకోవాలి. కొన్ని సందర్భాల్లో గ్యాస్ట్రిక్ నొప్పిని కూడా గుండెపోటుగా పొరపడే అవకాశముంది. హార్ట్ స్ట్రోక్ వచ్చినప్పుడు మొదటి గంటను గోల్డెన్ అవర్ అంటారు. నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రికి రోగికి తీసుకెళ్తే కాపాడొచ్చు.

అప్రమత్తంగా ఉండాలి



వయసుతో సంబంధం లేకుండా గుండె జబ్బులు వస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అవగాహన పెంచుకోవాలి. రోజూ కనీసం 45 నిమిషాలు నడవాలి. తగిన విశ్రాంతి ఉండాలి. సకాలంలో నిద్రపోవాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ఛాతిలో నొప్పి, మంట, ఆయాసం, చెమటలు పట్టడం లాంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలి. ఒకవేళ గుండె సమస్య అయినా భయపడొద్దు. డాక్టర్లు వైద్యం ద్వారా నయం చేస్తారు.

– డాక్టర్ శ్రీనివాసరాజు, గుండె వ్యాధుల స్పెషలిస్ట్, కిమ్స్ స్పెషాలిటీ ఆస్పత్రి

పట్టుకున్నారు.. వదిలేశారు


పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ట్రాక్టర్లు

వెంకటాచలం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను వెంకటాచలం పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. వివరాలు.. ముత్తుకూరు మండలం కోళ్లమిట్ట గ్రామంలో ఇసుక అక్రమంగా తవ్వి వెంకటాచలం మండలం గుడ్లూరువారిపాళేనికి తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. వారు గుడ్లూరువారిపాళెం వెళ్లి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కూటమి నేతలు నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలున్నాయి. కాగా అయితే ఏం జరిగిందో గానీ ఆదివారం మధ్యాహ్నం ఆ ట్రాక్టర్లను పోలీసులు నిర్వాహకులకు అప్పగించేశారు. కేసులు నమోదు చేయకుండా వదిలేశారని విమర్శలున్నాయి.

గ్రావెల్ దోపిడీకి అడ్డేది?

- రామదాసుకండ్రిగ చెరువులో తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు


ఖాళీ ప్లాట్లకు తరలించిన గ్రావెల్

వెంకటాచలం: మండలంలోని రామదాసుకండ్రిగ చెరువులో వారం రోజుల నుంచి గ్రావెల్ అక్రమ తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నా మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు. రామదాసుకండ్రిగకు వెళ్లే మార్గంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డు ఆనుకుని ఉన్న చెరువులో జేసీబీతో అక్రమంగా గ్రావెల్ తవ్వి ట్రాక్టర్లలో సమీపంలోని ఖాళీ ప్లాట్లకు తరలిస్తున్నారు. ఒక ట్రాక్టర్ ట్రిప్పు గ్రావెల్‌ను రూ.1,500 లెక్కన అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారు. తవ్వకాల గురించి స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. గ్రామస్తులు తమ ఇళ్ల అవసరాలు, పొలాల చదును కోసం చెరువు నుంచి మట్టి తరలించాలంటే అధికారులు సవాలక్ష ఆంక్షలు విధిస్తుంటారు. కూటమి నేతలు రేయింబవళ్లు ఇష్టారాజ్యంగా చెరువులో గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నా స్పందించకపోవడంపై విమర్శలున్నాయి. గ్రామానికి అతిసమీపాన ఉన్న చెరువులో గ్రావెల్ తవ్వకాల వల్ల భారీ గోతులు ఏర్పడి చిన్నపిల్లలు సరదాగా ఈతకు వెళ్లే సమయంలో ప్రమాదాల బారిన పడే పరిస్థితి వస్తుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆయా శాఖల ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ డైరెక్ట్ 10th, Inter (వయసు 18) డిగ్రీ (All), PG (All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమా, B.Tech, M.Tech,DBM, ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS. ✆ 8143100455, 7396995332 [G-286]

REAL ESTATE

■ Iskon City లో 100 అం॥లు అంకణం 3 లక్షలు, ద్వారకామయి అం॥ 1 లక్ష 35 వేల నుండి, అంజనీ శ్రీకారం అంకణం 1 లక్ష 20 వేలు, బ్యాంకు లోను కలదు, అపార్ట్‌మెంట్స్ కలవు. సంప్ర॥ 77020 23359. [NA-11384]

FLAT FOR SALE

■ నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్ రోడ్, సాయిబాబా గుడి ఎదురు వీధిలో Ready to Occupy 3BHK లగ్జరీ ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. సంప్రదించండి. 9177751401, 9989292211. [NA-230]

HOUSE FOR SALE

■ ఇండిపెండెంట్ హౌస్ : నెల్లూరు సిటీ, B.V. నగర్, R.T.O. ఆఫీసు రోడ్డు దగ్గర, 2 కార్లు పార్కింగ్ కలిగిన 2 ఫ్లోర్లు ఈస్ట్‌ఫేస్ కొత్త ఇల్లు అమ్మబడును. సంప్ర॥ 7995434866 [NA-24329]

PLOT FOR SALE

■ నెల్లూరు,ధనలక్ష్మీపురం,వెంకటాచలం, మనుబోలు, గూడూరు, బుచ్చి హైవే ఆనుకొని, నుడా అప్రూవ్ ప్లాట్స్ : 10లక్షలు నుండి, బ్యాంకు లోన్, స్పాట్ రిజిస్ట్రేషన్. సెల్: 95051 60510. [NA-24410]

■ మన దేశంలోనే మైసూర్ శాండిల్ కంపెనీకి అమ్మి మంచి ఆదాయాన్ని అందించే శ్రీ గంధం మొక్కలు మన నెల్లూరు కంపెనీ వారు మన జిల్లాలోని ఫామ్ ల్యాండ్స్‌గా అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. 9908822077 [SCA25008576]

SERVICES

GOLD FINANCE

■ MVS Gold బ్యాంకులలో, ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి కొనబడును. Opp. సాయిబాబా గుడి, వేదాయపాళెం, Nlr. 9346332303, 9281458813. [NA-11387]

CHANGE OF SURNAME

I, [illegible] (New Name) Wife of DUTTAPATI PARANDHAMA REDDY, residing at Pamulavaripalem, Chinthopu Post, Indukurpeta Mandal, SPSR Nellore District, Andhra Pradesh, hereby stated that I have changed my Surname from DUTTHAPATI DHARUNI BHARATHI (old name) to [illegible] (new name) Wife of DUTTAPATI PARANDHAMA REDDY as per affidavit sworn before the Notary, Nellore. on 25-8-2025.

WANTED

■ Wanted O&M Supervisors, Production Supervisors, Electricians, Fitters. Contact : 9848267839 [NA-3713]

■ RPES : For local (10th, Inter) & MNC Jobs (IT & Non IT) Degree/ MCA/ B.Tech). Contact : 9347110773. [NA-7148]

■ Ladies with Computer knowledge to work at kids Indoor Play zone (11 AM - 9 PM) Beside Bharath Petrol Bunk, Children's Park, Main Road. 9392829709 [NA-7153]

■ Aditya Birla Sun Life Required Sales Managers. Qlf: Graduation & above (M/F). Min 2 yrs Experience in Insurance / Banking & Finance / any Management Roles. CTC: upto 5 Lakhs PA + Incentives. Cell: 9885082555 [NA-11385]

■ Personal Loans ఆఫీస్ నందు Executive కావలెను. No Targets, Two Wheeler Must Qlf: Inter, Age : Below 25Y, Nellore Local Candidates.Sal:15000/-.Cell: 88858 02000. [NA-24408]

■ నెల్లూరులోని ప్రముఖ హాస్పిటల్స్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గం॥ డ్యూటీ, జీతం: 18,000. సంప్రదించండి. 8985011766, 9666994954. [NA-7154]

■ బ్యాంక్ లోన్స్ ప్రాసెస్ నందు Tele Caller కావలెను. 25+Age Married Female, టార్గెట్స్ లేవు, జీతం:12000/- నర్తకి సెంటర్, నెల్లూరు. ఫోన్ : 8340900666, 8340900444 [NA-24393]

■ ACT FiberNet లో హెల్పర్‌గా పని చేయుటకు 10th & Any Qualifications, Salary : 13,000/- Kavali, Nellore. Contact : 99633 86499. [NA-7149]

■ నెల్లూరు మిని బైపాస్ రోడ్డు TDP ఆఫీసు ఎదురుగా HPCL పెట్రోలు బంకు నందు పని చేయుటకు పంపుబాయ్స్ కావలెను. జీతం : 15000, ✆ 8919923469, 8341828889 [NA-24406]

■ కష్టమైన్నీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9666253675 [HA-16158]

■ Airtel Fiber లో జాబ్ చేయుటకు టెక్నీషియన్స్ - 10, లేడి కంప్యూటర్ ఆపరేటర్స్-2 కావలెను. క్రొత్తవారికి ప్రాధాన్యత. టూ వీలర్, 5G మొబైల్ Must, నెల్లూరు టౌన్. 70930 76861. [NA-24415]

■ లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. Qul : Any Degree, B.Tech / B.CA with computer knowledge, & 1-2 Yrs Experience. Contact : Dr. S. ఆండాళ్, లక్ష్మీ ఫెర్టిలిటీ సెంటర్, S2 సినిమా థియేటర్, పొగతోట, నెల్లూరు. సంప్ర॥ 99088 54316 [NA-2832]

■ పిక్కర్స్, ప్యాకర్స్, డ్రైవర్స్, హెల్పర్స్ కావలెను. సంప్రదించండి. HERO సూపర్ స్టాకిస్టు, శ్రీ బాలాజీ ఆటో మొబైల్స్, ఇనుమడుగు సెంటర్, నెల్లూరు. సెల్: 91000 66733. [SCA25008540]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన వచ్చిన ప్రకటనలు ప్రచురించబడవు.









